రాజకీయాల్లోకి కలకత్తా హైకోర్టు జడ్జి

- న్యాయమూర్తి పదవికి రేపు గంగోపాధ్యాయ్ రాజీనామా
- పలు కేసుల్లో తృణమూల్‌కు వ్యతిరేకంగా కీలక తీర్పులు

న్యూఢిల్లీ, మార్చి 3: పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు కీలక తీర్పులు వెలువరించి 'ప్రజల న్యాయమూర్తి'గా పేరు పొందిన కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ త్వరలో తన పదవి నుంచి వైదొలగనున్నారు. న్యాయమూర్తి పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నట్టు ఆయన వెల్లడించారు. 'న్యాయమూర్తి పదవికి మంగళవారం రాజీనామా చేయబోతున్నా. ఈ నిర్ణయానికి రాష్ట్రంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీయే కారణం. ఆ పార్టీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నా. నా రాజీనామాకు సంబంధించిన మరిన్ని వివరాలను తర్వాత వెల్లడిస్తా. న్యాయమూర్తిగా ఆరేండ్లు పనిచేశా. ఆ ప్రస్థానం ముగిసింది. ఇక నేను కొత్తగా చేయాల్సిందేమీ లేదు. నా తీర్పులు నచ్చనప్పుడు తృణమూల్ కాంగ్రెస్ నేతలు నన్ను పరిహసించారు. నన్ను తీవ్రంగా అవమానించారు. వారితో కొందరు న్యాయవాదులు కూడా గొంతు కలిపారు. నేను విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టి ప్రజలతో మమేకం కావాల్సిన అవసరమున్నది. వ్యాఖ్యాలను వేయాలనుకునేవారే న్యాయ స్థానాలకు వస్తారు. కానీ, బయట చాలా మంది దురదృష్టవంతులు ఉన్నారు' అని జస్టిస్ గంగోపాధ్యాయ్ ఓ ఇంటర్వ్యూలో వివరించారు. వాస్తవానికి ఆయన ఈ ఏడాది ఆగస్టులో రిటైర్ కావాల్సి ఉన్నట్టు తెలుస్తున్నది.

'అపరిచిత మహిళను డార్లింగ్ అనడం లైంగిక వేధింపే'

కోల్‌కతా: ఒక అపరిచిత మహిళను 'డార్లింగ్' అని పిలవడం లైంగిక వేధింపుల కిందకే వస్తుందని, చట్ట ప్రకారం నిందితుడు శిక్షార్హుడేనని కలకత్తా హైకోర్టు స్పష్టంచేసింది. కేసులో కింది కోర్టు నిందితుడికి విధించిన శిక్షను సమర్థించింది. నిందితుడు మద్యం మత్తులో ఉన్నా, లేకపోయినా అతడు శిక్షార్హుడేనని కలకత్తా హైకోర్టు సింగిల్ జడ్జి జే సేన్‌గుప్తా పేర్కొన్నారు. కేసు వివరాల్లోకి వెళితే.. కోల్‌కతాలో దుర్గా పూజ సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న ఒక మహిళా కానిస్టేబుల్ తాగి అల్లరి చేస్తున్న జానక్ రామ్ అనే వ్యక్తిని అదుపు చేయడానికి ప్రయత్నించగా 'హాయ్ డార్లింగ్.. నాకు శిక్ష వేయడానికి వచ్చావా?' అని అసభ్యంగా మాట్లాడాడు. దీనిపై మాయాబందర్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు విచారించిన నార్త్, మిడిల్ అండమాన్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నిందితునికి మూడు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ నిందితుడు అడిషనల్ సెషన్స్ కోర్టును, ఆపై హైకోర్టును ఆశ్రయించాడు.

బ్రేకప్ తర్వాత ప్రియుడి ఆత్మహత్యకు లవర్‌ను తప్పుబట్టలేం: కోర్టు

ముంబై: ప్రియునికి ప్రియురాలు బ్రేకప్ చెప్పిన తర్వాత, మానసిక ఆవేదనతో ఆ ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడితే, ఆ ప్రియురాలు అతనిని ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు పరిగణించలేమని ముంబై కోర్టు చెప్పింది. అయితే ఇష్టానుసారం ప్రేమికులను మార్చడం నైతికంగా సరికాదని తెలిపింది. ఆమె తిరస్కరణను ఎదుర్కొన్న బాధితునికి చట్టపరమైన ఉపశమనం ఏదీ లేదని వివరించింది. కేసు వివరాలు ఏమిటంటే, నితిన్ కేనీ, మనీషా చుడసమ ప్రేమించుకున్నారు. కొన్నాళ్ల తర్వాత నితిన్‌కు మనీషా బ్రేకప్ చెప్పింది. ఆ తర్వాత ఆమెకు రాజేశ్ పన్వర్‌తో నిశ్చితార్థం జరిగింది. దీంతో 2016 జనవరి 15న నితిన్ తన ఇంట్లో ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నారు. మనీషా బ్రేకప్ చెప్పడంతో నితిన్ మానసికంగా కుంగిపోయినట్టు కనిపిస్తున్నదని అదనపు సెషన్స్ జడ్జి ఎన్‌పీ మెహతా వ్యాఖ్యానించారు. ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కేసు వెల్లడి కావాలంటే, బాధితుడిని అందుకు పురిగొలిపినట్లు లేదా సలహా ఇచ్చినట్లు స్పష్టమవ్వాలని తెలిపారు.

బీజేపీకి షాక్

'లోక్‌సభ' తొలి జాబితా ప్రకటించిన మరుసటి రోజే చుక్కెదురు

పోటీ నుంచి తప్పుకున్న బెంగాల్ అసన్‌సోల్ అభ్యర్థి పవన్ సింగ్

టికెట్ రాక రాజకీయాలకు మాజీమంత్రి హర్షవర్ధన్ గుడ్‌బై

రేసు నుంచి తప్పుకొన్న గుజరాత్ మాజీ డిప్యూటీ సీఎం నితిన్

పవన్ సింగ్

హర్షవర్ధన్

నితిన్ పటేల్

న్యూఢిల్లీ/కోల్‌కతా, మార్చి 3: లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించిన మరుసటి రోజే బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ టికెట్ దక్కించుకొన్న బోజ్‌పురి గాయకుడు, నటుడు పవన్ సింగ్ ఎన్నికల బరిలో నిలిచేందుకు వెనుకడుగు వేశారు. తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేనంటూ కమలం పార్టీకి షాక్ ఇచ్చారు. ఈ మేరకు పవన్ సింగ్ ఆదివారం తన ఎక్స్ ఖాతాల్లో పోస్టు చేశారు. టికెట్ ఇచ్చినందుకు బీజేపీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు చెప్పిన ఆయన.. 'కొన్ని కారణాల' వల్ల పోటీచేయలేనని పేర్కొన్నారు. అయితే పోటీకి నిరాకరణపై పవన్ సింగ్ స్పష్టమైన కారణాలు వెల్లడించలేదు. పవన్ సింగ్ పోటీ నుంచి తప్పుకోవడంపై టీఎంసీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. కనీసం ఎన్నికల ప్రచారం కూడా ప్రారంభించకుండా బీజేపీ అసన్‌సోల్ స్థానాన్ని వదులుకొన్నదని ఎద్దేవా చేసింది. ప్రస్తుతం అసన్‌సోల్ లోక్‌సభ స్థానం నుంచి టీఎంసీ నేత శత్రుఘ్న సిన్హా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రాజకీయాలకు హర్షవర్ధన్ గుడ్‌బై

బీజేపీ మొదటి జాబితాలో టికెట్ నిరాకరణకు గురైన ఢిల్లీలోని ఛాందిని చౌక్ సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి హర్షవర్ధన్ రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. 30 ఏండ్ల రాజకీయ ప్రస్థానం తర్వాత తాను మళ్లీ తన మూలాలకు వెళ్లాలని అనుకొంటున్నట్టు హర్షవర్ధన్ ఆదివారం పేర్కొన్నారు. టొబాకో, పర్యావరణ మార్పులు వ్యతిరేకంగా తన పనిని కొనసాగిస్తానని తెలిపారు. మరోవైపు గుజరాత్‌లోని మెహసానా లోక్‌సభ స్థానానికి బీజేపీ పార్టీ తరపున అభ్యర్థిత్వం పోటీ నుంచి తప్పుకొంటున్నట్టు మాజీ డిప్యూటీ సీఎం నితిన్ పటేల్ ప్రకటించారు. రాష్ట్రంలోని 26 స్థానాలకుగానూ బీజేపీ 15 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయగా.. మెహసానా స్థానానికి ప్రకటించలేదు.

తొలి లిస్టులో తప్పులు

బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాలో కొన్ని తప్పులు దొర్లాయి. అస్సాంలో జరిగిన డీలిమిటేషన్‌ను పరిగణనలోకి తీసుకోకుండా.. పలు స్థానాలకు పాత నియోజకవర్గాల పేర్లతోనే అభ్యర్థులను ప్రకటించారు. దీంతో అస్సాం అభ్యర్థుల సవరణ జాబితాను బీజేపీ ఆదివారం విడుదల చేసింది. శనివారం లిస్టులో పేర్కొన్న మంగళ్‌దాయ్, కలియాబోర్ స్థానాలు ప్రస్తుతం లోక్‌సభ నియోజకవర్గాలుగా లేవు. కొత్త లిస్టులో వీటిని దర్రాంగ్ ఉదల్‌గిరి, కజిరంగాగా మార్చారు. మొదలి లిస్టు ప్రకారం అభ్యర్థి రంజిత్ దుత్తా పోటీచేస్తున్న స్థానం తేజ్‌పూర్‌ను సోనిత్‌పూర్‌గా సవరించారు. ఇక నౌంగోగ్‌ను నాగావ్‌గా, అటానమస్ డిస్ట్రిక్ట్‌ను డిపుగా మార్చారు.

33 మంది సిట్టింగ్‌ల మార్పు

195 మంది అభ్యర్థుల తొలి జాబితాలో బీజేపీ 33 మంది సిట్టింగ్ ఎంపీల స్థానంలో కొత్త ముఖాలను బరిలోకి దింపింది. మధ్యప్రదేశ్‌లో ఏడు, రాజస్థాన్, గుజరాత్, అస్సాం, ఢిల్లీల్లో ఐదు స్థానాల చొప్పున, ఛత్తీస్‌గఢ్‌లో నాలుగు, త్రిపుర, పశ్చిమబెంగాల్‌లో ఒక్క స్థానం చొప్పున సిట్టింగ్ ఎంపీలను మార్చింది. న్యూఢిల్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖికి హ్యాండిచ్చిన బీజేపీ.. ఆ సీటును సుష్మాస్వరాజ్ కుమార్తె బన్సూరి స్వరాజ్‌కు కేటాయించింది. పార్లమెంట్‌లో బీఎస్పీ ఎంపీ డానిష్ అలీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన దక్షిణ ఢిల్లీ ఎంపీ రమేశ్ బిధూరిని పోటీ నుంచి తప్పించింది. గుజరాత్‌లో మూడు సార్లు ఎంపీగా గెలిచిన కిరీట్ సోలంకి సీటు అహ్మదాబాద్(వెస్టు)ను కిదార్‌భాయ్ మక్వానాకు ఇచ్చారు. పోరుబందర్ స్థానం నుంచి కేంద్ర మంత్రి మన్సుక్ మాండవీయను బరిలోకి దింపారు. మధ్యప్రదేశ్‌లో గుణ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ క్రిష్ణపాల్ సింగ్‌ను తప్పించి.. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కేటాయించారు.

బీజేపీకి ప్రధాని మోదీ 2 వేల విరాళం

ప్రధాని మోదీ ఆదివారం బీజేపీకి పార్టీ ఫండ్‌గా రూ.2 వేలు విరాళం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ నమో యాప్ ద్వారా ఈ విరాళాల కార్యక్రమంలో పాలుపంచుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఈనెల 1న 'డొనేషన్ ఫర్ నేషనల్ బిల్డింగ్' క్యాంపెయిన్‌ను ప్రారంభించింది.

నితిన్ గడ్కరీ పేరెందుకు లేదు?

బీజేపీ తొలి జాబితాలో అత్యంత సీనియర్ నేత, పార్టీకి విధేయుడిగా ఉన్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేరు లేకపోవడంపై శివసేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మోదీ, అమిత్‌షా పేర్లను ముందుగానే ప్రకటించుకోవడాన్ని ఆయన ప్రస్తావించారు. వీరిద్దరి కంటే తాము గడ్కరీ పేరే పార్టీలో ముందుగా విన్నామని అన్నారు. ఇదే సమయంలో అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న కృపాశంకర్ సింగ్ పేరును మొదటి లిస్టులో ప్రకటించారని ఠాక్రే విమర్శించారు.

రూ.400 కోట్ల ఫామ్‌హౌజ్ కూల్చివేత

లిక్కర్ వ్యాపారిపై చర్యలు

న్యూఢిల్లీ: ప్రముఖ లిక్కర్ వ్యాపారి పాంటీ చద్దా కుటుంబానికి చెందిన ఫామ్‌హౌజ్‌ను ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ (డీడీఏ) కూల్చివేసింది. సుమారుగా రూ.400 కోట్ల విలువైన ఈ కట్టడం ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించారన్న కారణంతో కూల్చివేశారు. 'ఇక్కడి ఛత్రపూర్ ప్రాంతంలోని 10 ఎకరాల్లో ఈ ఫామ్ హౌజ్ విస్తరించి ఉంది. దీంట్లో గార్డెన్, ఔట్‌హౌస్, ప్రధాన భవనం ఉన్నాయి. ప్రధాన భవనం కూల్చేవేయటాన్ని డీడీఏ అధికారులు శనివారం పూర్తిచేశారు. అక్రమ కట్టడాల్ని కూల్చేశాక, ఆ భూమిని స్వాధీనం చేసుకున్నాం' అని డీడీఏ అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ చర్యలపై చద్దాకు చెందిన వేవ్ గ్రూప్ స్పందించలేదు.

గూర్ఖాలకు గిరిజన హోదా కావాలి

రక్తంతో ప్రధానికి బీజేపీ ఎమ్మెల్యే లేఖ

డార్జిలింగ్: గూర్ఖాలకు న్యాయం చేయాలని కోరుతూ ప్రధాని మోదీకి డార్జిలింగ్ బీజేపీ ఎమ్మెల్యే నీరజ్ జింబా తన రక్తంతో లేఖ రాశారు. పర్వత ప్రాంతాల్లోని 11 గూర్ఖా జాతులకు శాశ్వత రాజకీయ పరిష్కారంలో భాగంగా షెడ్యూల్ గిరిజన హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. 'నేను తీసుకొన్న నిర్ణయం కొందరికి అసాధారణమనిపించవచ్చు. కానీ తీవ్రమైన సమస్య పరిష్కారం కోరుతూ నా రక్తంతో ప్రధాని మోదీకి లేఖ రాయాల్సి వచ్చింది. గూర్ఖాల కలే నా కల. గత పదేండ్లుగా బీజేపీ ఇచ్చిన హామీల్లో షెడ్యూల్ హోదా ప్రస్తావన ఉన్నా దాన్ని నెరవేర్చలేదు' అని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల వేళ కేంద్ర క్యాబినెట్ భేటీ

'వికసిత్ భారత్'పై మేథోమథనం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ ప్రభుత్వంలో ఇదే చివరిదిగా భావిస్తున్న ఈ క్యాబినెట్ సమావేశంలో 'వికసిత్ భారత్ – 2047'పై మేథోమథనంతో పాటు మూడోసారి అధికారంలోకి వచ్చాక రానున్న ఐదేండ్లు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చ జరిగినట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత మొదటి 100 రోజుల పాటు తీసుకోవాల్సిన సత్వర చర్యలపై ఈ సమావేశంలో చర్చించారని సమాచారం. రానున్న ఎన్నికలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరగగా, మంత్రులు ప్రజల్లోకి వెళ్లి వివిధ వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి వివరించాలని ప్రధాని మోదీ కోరినట్టు సమాచారం. కాగా, 2047 నాటికి దేశం సాధించాల్సిన లక్ష్యాలు, ఆర్థిక వృద్ధి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, సులభతర వాణిజ్యం, జీవనం, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై 'వికసిత్ భారత్' పేరుతో రోడ్‌మ్యాప్ తయారుచేసినట్టు అధికార వర్గాలు తెలియజేశాయి.

తల్లి చనిపోతే గుండు గీయించుకోని మోదీ

ఆయన అసలు హిందువే కాదు!

ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్

పాట్నా, మార్చి 3: ప్రధాని మోదీపై ఆర్జేడీ చీఫ్, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీ హిందువే కాదని, తల్లి మరణించిన తర్వాత ఆయన గుండు కూడా చేయించుకోలేదని ఆరోపించారు. మోదీకి కుటుంబం లేదని, అందుకే ఆయన వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా మాట్లాడుతుంటారని అన్నారు. బీహార్ రాజధాని పాట్నాలోని గాంధీ మైదానంలో ఆర్జేడీ ఆదివారం 'జన ఆశీర్వాద్ ర్యాలీ' పేరుతో భారీ సభ నిర్వహించింది. ఈ సభకు ఇండియా కూటమికి చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లాలూ మాట్లాడుతూ మోదీ లక్ష్యంగా విమర్శలు ఎక్కుపెట్టారు. తల్లి మరణం తర్వాత ప్రతి ఒక్క హిందూ గుండు చేయించుకొంటారని, అయితే మోదీ అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీ దేశంలో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని లాలూ ఆరోపించారు.

రైలు నుంచి మహిళను గెంటేసిన టీటీఈ

- జనరల్ టికెట్‌తో ఏసీ కోచ్ ఎక్కిందని అమానుషం
- బాధితురాలి పరిస్థితి విషమం

ఫరీదాబాద్, మార్చి 3: జనరల్ టికెట్‌తో ఏసీ కోచ్ ఎక్కిన ఒక మహిళపై రైల్వే టీటీఈ అమానుషంగా ప్రవర్తించాడు. నడుస్తున్న రైలు నుంచి ఆమెను బయటకు తోసేశాడు. షాక్‌కు గురి చేసే ఈ ఘటన హర్యానాలోని ఫరీదాబాద్‌లో చోటు చేసుకుంది. ఫరీదాబాద్, ఎస్‌జీజేఎం నగర్‌కు చెందిన భావన.. ఝాన్సీలోని ఒక వివాహానికి వెళ్లేందుకు ఫరీదాబాద్‌లో ఆగిన జీలమ్ ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్ ఎక్కింది. దీనిపై టీటీఈ ఆగ్రహం వ్యక్తం చేయగా, ఫైన్ కడతానంటూ తెలిపింది. దీనికి నిరాకరించిన టీటీఈ కోపంతో ఆమె సామానును ప్లాట్‌ఫాంపైకి విసిరేసి, ఆమెను రైలులోంచి తోసేయడంతో రైలు, ప్లాట్‌ఫాం మధ్య చిక్కుకుని తల, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే టీటీఈ పరారయ్యాడు. హత్యాయత్నం కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు టీటీఈ కోసం గాలిస్తున్నారు.

క్రికెట్ చూస్తూ.. విధులు మరిచారు

లోకోపైలట్ల నిర్లక్ష్యం వల్లే ఏపీ రైలు ప్రమాదం

న్యూఢిల్లీ, మార్చి 3: రైలు డ్రైవర్, సహాయ డ్రైవర్ క్రికెట్ పిచ్చి 14 మంది ప్రాణాలను బలి తీసుకుంది. గత ఏడాది అక్టోబర్ 29న ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలో ఆగి ఉన్న విశాఖపట్నం–పలాస ట్రైన్‌ను రాయగఢ ప్యాసింజర్ వెనుక నుంచి ఢీకొనడంతో 14 మంది మరణించారు. దీనికి డ్రైవర్, అసిస్టెంట్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని, వారి తమ ఫోన్లలో క్రికెట్ చూస్తూ అప్రమత్తంగా ఉండకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రయాణ సమయంలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ ప్రమాదం చర్చించేలా చేసిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్‌లు అప్రమత్తంగా ఉండే వ్యవస్థను ప్రవేశపెడుతున్నామని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ ఆధీనంలోకి ప్రైవేట్ ట్యాంకర్లు

- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రకటన
- బెంగళూరులో నీటి కొరతతో ప్రజల తీవ్ర అవస్థలు
- వాటర్ ట్యాంకర్ల ధరలు డబుల్: నగరవాసులు

బెంగళూరు, మార్చి 3: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోని బెంగుళూరులో తాగునీటి సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకుంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్స్ దోపిడితో సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. ఇష్టమున్నట్టు ధరలు వసూలు చేస్తుండటంతో నగరంలోని పలు ప్రాంతాల్లో సామాన్యులు, ఐటీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో నగరంలోని ప్రైవేట్ వాటర్ ట్యాంకర్స్ అన్నింటినీ స్వాధీనం చేసుకోనున్నట్టు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తాజాగా ప్రకటించారు. ప్రైవేట్ బోర్‌వెల్ నిర్వాహకులు, ప్రైవేట్ వాటర్ ట్యాంకర్స్ యజమానులు 'బెంగళూరు వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్' (బీడబ్ల్యూఎస్ఎస్‌బీ) వద్ద మార్చి 7లోగా రిజిష్టర్ చేసుకోవాలని కాంగ్రెస్ సర్కార్ ఆదేశాలు జారీచేసింది.

నీటి సంక్షోభంలో నగరం

బెంగళూరులో వైట్‌ఫీల్డ్, వర్తూర్, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో నీటి సరఫరా పూర్తిగా స్తంభించిపోయింది.'వాటర్ ట్యాంకర్ ధరలు డబుల్ అయ్యాయి. ఫిబ్రవరిలో రూ.4,000 ఖర్చు చేశాం. తాగునీటి కోసం వాటర్ క్యాన్లు కొన్నాం' అని 35 ఏండ్ల సమీనా తాజ్ చెప్పారు. సామాన్యులే కాదు, అత్యంత ఖరీదైన అపార్ట్‌మెంట్స్‌లో ఉన్న వారు కూడా ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల ధరలను భరించలేకపోతున్నారు.

బుర్కినా ఫాసోలో 170 మంది ఊచకోత!

న్యూఢిల్లీ: పశ్చిమాఫ్రికా దేశం బుర్కినా ఫాసోలోని మూడు గ్రామాలపై వారం క్రితం దుండగులు జరిపిన దాడుల్లో 170 మంది మరణించారు. అనేక మంది గాయపడ్డారు. పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. రీజనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలి బెంజమిన్ కౌలిబలీ ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. కొమ్సిల్గా, నోడిన్, సోరోయా గ్రామాలపై ఫిబ్రవరి 25న ఈ దాడులు జరిగాయి. ఈ దాడులపై దర్యాప్తునకు ఆదేశించారు. అల్ ఖైదా, ఐఎస్ ఉగ్రవాద సంస్థలకు అనుబంధంగా ఉన్న గ్రూపులు ఈ దాడులకు పాల్పడుతున్నాయి.

'ఉల్లూ యాప్‌పై చర్యలు తీసుకోవాలి'

న్యూఢిల్లీ: పాఠశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని లైంగిక కార్యకలాపాలను ప్రదర్శిస్తున్న ఉల్లూ యాప్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) కేంద్రాన్ని కోరింది. ఎన్‌సీపీసీఆర్ చీఫ్ ప్రియాంక్ కనూంగో కేంద్రానికి ఈమేరకు లేఖ రాశారు. యాప్ తన సబ్‌స్క్రైబర్లకు అశ్లీల దృశ్యాలను చూపిస్తున్నదని తెలిపారు. దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. జెమ్స్ ఆఫ్ బాలీవుడ్ దీనిపై తమకు ఫిర్యాదు చేసిందని చెప్పారు.

పాకిస్థాన్ ప్రధానిగా షెహబాజ్

- వరుసగా రెండోసారి బాధ్యతలు
- చిన్న పార్టీల మద్దతుతో ప్రభుత్వం

ఇస్లామాబాద్, మార్చి 3: పాకిస్థాన్ ప్రధానమంత్రిగా షెహబాజ్ షరీఫ్ రెండోసారి ఎన్నికయ్యారు. ఆదివారం పాక్ జాతీయ అసెంబ్లీలో కొత్త ప్రధాని ఎన్నిక కోసం ఓటింగ్ నిర్వహించారు. 336 మంది సభ్యులు గల సభలో పాకిస్థాన్ ముస్లిం లీగ్–నవాజ్(పీఎంఎల్-ఎన్) అభ్యర్థి షెహబాజ్ షరీఫ్ 201 ఓట్లు సాధించారు. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ అభ్యర్థి ఒమర్ ఆయుబ్ ఖాన్‌కు 92 ఓట్లు వచ్చాయి. దీంతో పాకిస్థాన్ 24వ ప్రధానమంత్రిగా 72 ఏండ్ల షెహబాజ్ షరీఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా, ప్రధాని ఎన్నిక సమయంలో జాతీయ అసెంబ్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పీటీఐ మద్దతురాలైన సభ్యులు ఇమ్రాన్ ఖాన్ పోస్టర్లను ప్రదర్శించి ఆయనకు అనుకూలంగా నినాదాలు చేశారు. ప్రతిగా పీఎంఎల్-ఎన్ సభ్యులు కూడా నవాజ్ షరీఫ్‌కు అనుకూల నినాదాలు అందుకున్నారు. ఈ నినాదాల మధ్యనే ప్రధాని ఎన్నిక జరిగింది.

కొలువుదీరనున్న సంకీర్ణ ప్రభుత్వం

2022 ఏప్రిల్ నుంచి 2023 ఆగస్టు వరకు ఆయన పాక్ ప్రధానిగా వ్యవహరించారు. ఆ తర్వాత పార్లమెంటును రద్దు చేయగా ఫిబ్రవరి 8న ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో షరీఫ్ నేతృత్వంలోని పీఎంఎల్–ఎన్ 265 స్థానాల్లో పోటీ చేసి కేవలం 75 స్థానాలు దక్కించుకొన్నది. అయితే, ఏ పార్టీకీ మెజారిటీ రాకపోవడంతో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు తప్ప మరో మార్గం లేకుండా పోయింది.

కశ్మీరీ కుటుంబంలో జన్మించి..

పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు షెహబాజ్ షరీఫ్ తమ్ముడు. 1951 సెప్టెంబర్‌లో లాహోర్‌లో కశ్మీరీ మాట్లాడే కుటుంబంలో షరీఫ్ జన్మించారు. ఆయన కుటుంబం కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ నుంచి వ్యాపారరీత్యా మొదట అమృత్‌సర్‌కు, ఆ తర్వాత పాకిస్థాన్‌కు వలసవెళ్లి స్థిరపడింది.

సోషల్ మీడియాపై శాశ్వత నిషేధం!

దేశంలో సోషల్ మీడియా సంస్థలపై శాశ్వత నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన తీర్మానం పాకిస్థాన్ సెనెట్ ముందుకు రాబోతున్నది. సెనెటర్ బహ్రమంద్ ఖాన్ టాంగీ ప్రవేశపెట్టిన తీర్మానంపై సెనెట్ సోమవారం చర్చించనున్నది. 'దేశ ప్రయోజనాలకు, సైన్యానికి వ్యతిరేకంగా ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. ఫేస్‌బుక్, టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, యూ ట్యూబ్ ప్రసారాలను శాశ్వతంగా నిషేధించాలి' అని తీర్మానంలో సెనెటర్ కోరారు.

'సీయూఈటీ-యూజీ షెడ్యూల్ మారొచ్చు'

న్యూఢిల్లీ: కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)–యూజీ పరీక్షల తేదీలు లోక్‌సభ ఎన్నికల షెడ్యూలును బట్టి మారే అవకాశం ఉందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) చైర్మన్ జగదీశ్ కుమార్ చెప్పారు. ఈ పరీక్షలు మే 15 నుంచి 31 వరకు జరుగుతాయని, ఫలితాలు జూన్ 30న వెలువడతాయని ఎన్టీఏ మంగళవారం ప్రకటించింది. మంగళవారం నుంచి ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 26తో ముగుస్తుంది.

అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ట్రంప్ జోరు

కొలంబియా: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ చేసే దిశగా డొనాల్డ్ ట్రంప్ దూసుకెళ్తున్నారు. ఇడాహో, మిస్సోరీ, మిషిగన్‌లో జరిగిన ప్రైమరీలో ఆయన విజయం సాధించారు. దీంతో ఆయనకు మద్దతు పలికే డెలిగేట్ల సంఖ్య 244కు చేరింది. ఆయన ప్రత్యర్థి నిక్కీ హేలీకి 24 మంది డెలిగేట్లు మాత్రమే మద్దతిస్తున్నారు. రిపబ్లికన్ పార్టీ తరపున దేశాధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం రావాలంటే, కనీసం 1,215 మంది డెలిగేట్ల మద్దతు అవసరం. వచ్చే మంగళవారం 16 రాష్ట్రాల్లో ఓటింగ్ జరుగుతుంది.

విద్యావంతుల్లో వృద్ధాప్యం ఆలస్యం

కొలంబియా వర్సిటీ అధ్యయనంలో వెల్లడి

న్యూయార్క్, మార్చి 3: చదువు మంచి జీవితాన్ని ఇవ్వడమే కాదు, మనిషి ఆయుష్షును కూడా పెంచుతుందట. ఉన్నత విద్యావంతులు మిగతా వారి కంటే ఎక్కువ రోజులు జీవిస్తారని, వీరిలో వృద్ధాప్యం కూడా ఆలస్యంగా వస్తున్నదని ఓ అధ్యయనంలో వెల్లడైంది. అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన మయిల్‌మెన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనంలో విద్యకు, వృద్ధాప్యానికి మధ్య సంబంధం ఉందని గుర్తించారు. అమెరికాలోని ఫ్రెమింగ్‌హామ్ నగరంలో ఫ్రెమింగ్‌హామ్ హార్ట్ స్టడీ పేరుతో 1948 నుంచి అక్కడి ప్రజల ఆరోగ్యాలను పర్యవేక్షిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను తీసుకొని కొలంబియా యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనం జరపగా.. ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ప్రతి రెండేండ్ల పాఠశాల విద్యను అభ్యసించడం వల్ల వృద్ధాప్యం మీదపడటం 2 నుంచి 3 శాతం ఆలస్యమవుతుందని పరిశోధకులు గుర్తించారు. సాధారణ వ్యక్తుల కంటే ఉన్నత విద్యావంతుల్లో మరణ ముప్పు 10 శాతం తక్కువగా ఉంటుందని తేల్చారు.

నీటి లోపల నిఘాకు మెరైన్ రోబో

అభివృద్ధి చేసిన ఐఐటీ పరిశోధకులు



న్యూఢిల్లీ: నీటి లోపల నిఘా కోసం ఐఐటీ మండి, ఐఐటీ పాలక్కడ్‌కు చెందిన పరిశోధకులు అధునాతన మెరైన్ రోబోను అభివృద్ధి చేశారు. సముద్ర జలాలు, ఇతర నీటి వనరుల్లో అట్టడుగుకు సైతం చేరుకొని పని చేసేలా ఈ రోబోను రూపొందించారు. ప్రస్తుతం సముద్రంలో నీటి లోపల నిఘా, అధ్యయనం కోసం పరిశోధన నౌకలను వినియోగించాల్సి వస్తున్నది. ఇందుకు మనుషుల అవసరం కూడా ఎక్కువే. పైగా వీటి నిర్వహణ ఖర్చు అధికం. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో కచ్చితమైన నిఘా, అధ్యయనం కోసం ఈ మెరైన్ రోబో మెరుగ్గా పని చేస్తుందని ఐఐటీ మండిలోని సెంటర్ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జగదీశ్ కడియం తెలిపారు. మెరైన్ రోబోను వినియోగించడం ద్వారా సముద్ర జలాల్లో నిఘా కోసం పని చేసే మనుషుల ప్రాణాలకు ఉన్న ముప్పును కూడా తగ్గించవచ్చని ఆయన తెలిపారు. మెరైన్ రోబో ద్వారా జలవిద్యుత్ కేంద్రాల్లో నీటి లోపలి నిర్మాణాలను పరిశీలించవచ్చని, పర్యావరణ సమస్యలను వేగంగా గుర్తించే అవకాశం ఉంటుందని ఐఐటీ పాలక్కడ్ ప్రొఫెసర్ శాంతకుమార్ మోహన్ తెలిపారు. ఈ మెరైన్ రోబోకు సంబంధించిన వివరాలు ఓషియన్ ఇంజినీరింగ్, జర్నల్ ఆఫ్ ఇంటెలిజెంట్ అండ్ రోబోటిక్ సిస్టమ్స్ అనే జర్నళ్లలో ప్రచురితమయ్యాయి.

పీచు తింటే మెదడుకు చురుకుదనం!

60 ఏండ్లు పైబడినవారికి శాస్త్రవేత్తల సూచన



లండన్: చక్కని జీర్ణ వ్యవస్థకు, సంపూర్ణ ఆరోగ్యానికి పీచు(ఫైబర్) అవసరం. రోజూ ఫైబర్ సప్లిమెంట్ తీసుకుంటే60 ఏండ్లు పైబడినవారిలో మెదడు పనితీరు మెరుగవుతుందని తాజా అధ్యయనంలో తేలింది. లండన్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ కోర్స్, పాపులేషన్ సైన్సెస్ ఈ అధ్యయనం నిర్వహించింది. ఇందుకోసం వారు 36 వృద్ధ జంటల ఆహారపు అలవాట్లను, వారి జీవన విధానాన్ని పరిశీలించారు. నిత్యం పీచు పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఎముకలు పటిష్ఠం కావడంతో పాటు మెదడు చురుగ్గా పని చేస్తుందని తెలిపారు. 'కేవలం 12 వారాల్లో మార్పు రావడం గమనించి మేము ఆశ్చర్యపోయాం. పేగులు(గట్)–మెదడు మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషిస్తే దీర్ఘ కాలం పాటు ఆరోగ్యంగా బతికే మార్గాలు కనిపిస్తున్నాయి' అని డాక్టర్ నిలోచ్లాయిన్ తెలిపారు. మొక్కలు, ఆకుకూరల్లోని పీచు మెదడు ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తుందని సైంటిస్టులు తెలిపారు. పీచు కలిగిన పదార్థాలు తినడం వల్ల గట్ మైక్రోబియమ్(అన్ని అవయవాలపై ప్రభావం చూపే జీర్ణ వ్యవస్థ)లో మెరుగైన మార్పులు వచ్చాయి. ఇవి మెదడు పనితీరుపైనా సానుకూల ప్రభావాన్ని చూపించాయి. అయితే పీచు ప్రభావం దీర్ఘ కాలం ఉంటుందా, ఎక్కువ మందిపై ప్రభావం చూపుతుందా అనే అంశంపై మరింత అధ్యయనం చేయాల్సి ఉందని శాస్త్రవేత్తలు వెల్లడించారు.